క్లుప్తంగా

కేంద్ర మంత్రి మురుగన్‌కు అభినందనలు



ఆర్కే సెల్వమణి

నగరి : కేంద్ర సమాచార, పౌర మంత్రిత్వ శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన బీజేపీ నేత ఎల్.మురుగన్‌కు మాజీ మంత్రి ఆర్కేరోజా భర్త ఆర్కే సెల్వమణి మంగళవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. తనకు ఆప్త మిత్రుడైన ఎల్.మురుగన్ మరోమారు కేంద్ర మంత్రిగా నియమితులు కావడం చాలా సంతోషకరమన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ నిర్వహిస్తున్న వేద పండితులు

నగరి : మున్సిపల్ పరిధిలోని కీళపట్టు చంద్రమౌళీశ్వర ఆలయంలో శ్రీ ఓందేవి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. చంద్రమౌళీశ్వర ఆలయ ప్రాకారంలో నిర్మించనున్న శ్రీఓందేవి ఆలయానికి వేదపండితులు గోపూజ, గణపతి పూజ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు సుబ్రమణ్యం పూజల్లో పాల్గొన్న భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

వ్యాధుల నివారణకు టీకాలు వేయండి



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ ప్రభాకర్

కార్వేటినగరం: వర్షాకాలంలో పశువులకు సోకే వ్యాధుల నివారణకు టీకాలు వేయాలని జిల్లా పశుసంవర్ధశాఖ సహాయ సంచాలకుడు ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పశు వైద్యశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్థకశాఖ సహాయ సంచాలకులు మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు సోకే గొంతువాపు, జబ్బవాపు, చిటుకు తదితర ప్రాణాంతక వ్యాధులపై పాడి రైతులకు అవగాహన కల్పించి, వాటి నివారణకు వ్యాక్సిన్లు వేయాలని సూచించారు. పశువులు మరణించకుండా తగు జాగ్రత్తలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి, సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ హేమకుమార్, పశువైద్య సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా విత్తన దినోత్సవం



విత్తన దినోత్సవంలో పాల్గొన్న వ్యవసాయ పరిశోధనా స్థానం అధికారులు, శాస్త్రవేత్తలు

తిరుపతి సిటీ: స్థానిక పెరుమాళ్లపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో మంగళవారం విత్తన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్ఏఆర్ఎస్ సహాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ సీ.రమణ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విత్తన ఎంపికతో ఆరోగ్యకరమైన పంటతో పాటు అధిక దిగుబడికి అవకాశం ఉంటుందన్నారు. రైతులు లోదుక్కులు, యాంత్రీకరణపై దృష్టి సారించాలని సూచించారు. సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం రైతులతో వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇష్టాగోష్టి నిర్వహించి పలు సందేహాలను నివృత్తి చేసి పంట దిగుబడి పెంచేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలను తెలిపే కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆర్‌పీ వాసంతి, డాక్టర్ సుమతి, కేఆర్ ఠాగూర్, హేమలత, శ్రీవల్లీదేవి, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో విచ్చేసిన రైతులు పాల్గొన్నారు.

అల్ల నేరేడు.. పోషకాలు మెండు

- ఆరోగ్యఫల ప్రదాయనిగా గుర్తింపు
- సీ విటమిన్ పుష్కలంగా లభించే సీజనల్ ఫ్రూట్
- మధుమేహ వ్యాధిగ్రస్తులకు దివ్యౌషధం
- మార్కెట్‌లో లభిస్తున్న నేరేడు
- విరివిగా కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



విక్రయానికి సిద్ధంగా అల్లనేరేడు

తిరుపతి సిటీ: ప్రకృతి ప్రసాదించే పండ్ల జాతుల్లో ఒకటైన ఆరోగ్య ఫల ప్రదాయనిగా పిలచే అల్లనేరేడు పండును సక్రమంగా వినియోగిస్తే ఆరోగ్యానికి సంపూర్ణంగా మేలు చేయడంతో పాటు శరీరంలో ఏర్పడే అనేక అనారోగ్య సమస్యలను, రుగ్మతలను దూరం చేస్తుంది. రుచిలో మేటిగా ఉండే నేరేడు పండు మాత్రమే కాకుండా ఆకులు, చెట్టు బెరడు, గింజలు కూడా శరీరానికి చక్కని మేలు చేస్తాయి. అల్లనేరేడు పండులో అత్యధిక పోషకాలు ఉన్న నేపథ్యంలో పండు రూపంలోనే కాకుండా ఆరోగ్య పానీయాలు, జామ్‌లు, ఐస్ క్రీమ్ తయారీలో పెద్దఎత్తున వాడుతున్నారు. దీంతో పాటు నేరేడు కాయలను వెనిగర్, వైన్ తయారీలో ప్రముఖంగా వినియోగిస్తున్నారు. నేరేడు పండ్లు కోయడం చాలా వ్యయంతో కూడుకున్నది కావడంతో ధర అధికంగానే ఉంటుంది. రైతుల వద్ద దళారులు కేజీ రూ.80కి కోనుగోలు చేసి వ్యాపారులకు రూ.160కి విక్రయిస్తున్నారు. వినియోగదారుల చేతికొచ్చే సరికి ధర రూ.270 నుంచి రూ.300 పలుకుతోంది. అందులో నాణ్యమైన నేరేడు పండ్లను వేరు చేసి ఇంకా లాభసాటి ధరకు విక్రయిస్తున్నారు. సంప్రదాయ ఆయుర్వేద వైద్య విధాన పరంగా అనేక ఔషధ లక్షణాలు కలిగి ఉన్న నేరేడుకు అత్యంత ప్రాముఖ్యం ఉంది. ప్రస్తుత సీజన్‌లో రోజుకు రెండు చొప్పున నేరేడు పండ్లు తింటే వ్యాధులు రాకుండా దూరంగా ఉండవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

అల్లనేరేడు పండ్లతో ప్రయోజనాలు ఇవే..!

- నేరేడు పండ్లలో ఐరన్, క్యాల్షియం, పొటాషియంతో పాటు ఏ, సీ విటమిన్లు పుష్కలంగా ఉంటాయి.
- వ్యాధి నిరోధకశక్తి పెరిగి సీజనల్ వ్యాధుల బారి నుంచి రక్షణ కలుగుతుంది
- మూత్ర సమస్యల నియంత్రణలో ఎంతో ఉపయోగపడుతుంది
- ఆకలిని పెంచే గుణంతో పాటు శరీరంలోని పైత్యాన్ని తగ్గిస్తుంది
- అల్లనేరేడు చెక్క నుంచి తీసిన కషాయం అతిసార, నీళ్ల విరోచనాలు, జ్వరాన్ని తగ్గిస్తుంది
- విత్తనాలను ఎండబెట్టి చూర్ణం చేసి తీసుకుంటే మధుమేహం కంట్రోల్ అవుతుంది.
- కిడ్నీలను శుభ్రపరుస్తుంది. మూత్రాశయంలో ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి
- కాలేయం పనితీరును మెరుగు పర్చడంతో పాటు శుభ్రపరుస్తుంది
- యాంటీ ఆక్సిడెంట్లు గుండెకు, మెదడుకు దివ్యౌషధంగా పనిచేస్తాయి
- దంతాలు, చిగుళ్ల ఆరోగ్యకరంగా ఉంటాయి. చిగుళ్ల నుంచి రక్త స్రావం తగ్గుతుంది. నోట్లో చెడు బ్యాక్టీరియా నశించి దుర్వాసన రాకుండా చేస్తుంది.
- కడుపులో పేరుకుపోయిన మలినాలు బయటకు పోవడానికి, పేగుల్లో చుట్టుకుపోయిన వెంట్రుకలను కరిగించడానికి నేరేడు పండు దోహదపడుతుంది
- అన్ని వేళల్లో ఆరోగ్యానికి నేరేడు పండు భరోసా ఇస్తుంది.

అధికంగా తింటే..అనర్థాలు తప్పువు

- నేరేడు పండ్లు తినడంలో నియంత్రణ లేకుంటే దుష్ఫలితాలు సంభవిస్తాయి. వగురు రుచి కలిగిన నాణ్యత లేని పండ్లను భుజిస్తే గొంతు నొప్పి సంభవించవచ్చు.
- సీజన్ మారే సమయంలో వచ్చే అల్ల నేరేడు పండ్లను మితంగా తినాలి
- ఉబ్బసం ఉన్నవారు ఈ పండ్లను మితంగా తినాలి. దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలు వచ్చే ఆస్కారం ఉంది.
- నేరేడు పండ్లలో ఉండే అత్యధిక లవణాలు, పోషకాల వల్ల బలహీనమైన జీర్ణవ్యవస్థ కలిగిన వారికి తరచూ కడుపునొప్పి సంభవించే అవకాశం ఉంది.

ఆరోగ్యానికి దివ్యౌషధం



అల్ల నేరుడు పండ్లు ఆరోగ్యానికి దివ్యౌషధంగా పనిచేస్తాయి. శరీరంలోని అనేక రుగ్మతలను నివారిస్తాయి. ఐరన్, క్యాల్షియం, పొటాషియం ఎక్కువగా ఉంటుంది. సీ విటమిన్ నేరేడు ద్వారా శరీరానికి అధికంగా లభిస్తుంది. సీజనల్ ఫ్రూట్‌గా పిలవబడే అల్లనేరేడు మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఎంతగానో మేలు చేస్తుంది. ఇందులో జంబోలిన్ ఉండడం వల్ల విత్తనాలు చూర్ణం చేసి తీసుకుంటే మధుమేహం కంట్రోల్‌లో ఉంటుంది. మితంగా తినాలి. అతిగా తింటే జలుబు, దగ్గుతో పాటు శ్వాసకోస వ్యాధులకు వచ్చే అవకాశం ఉంది.

– డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, ప్రొఫెసర్, ఎస్వీ ఆయుర్వే కళాశాల, తిరుపతి

వైభవంగా బాటగంగమ్మ జాతర



విశేషాలంకరణలో బాటగంగమ్మ



ఆలయ ఆవరణలో పొంగళ్లు వండుతున్న మహిళలు

కార్వేటినగరం: మండలకేంద్రంలోని బీసీకాలనీ సమీపంలో పచ్చికాపల్లం రోడ్డులో ఉన్న బాటగంగమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారి జాతర వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారికి విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించి, పిండి దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే బీసీ కాలనీ వీధుల్లో విద్యుత్ దీపాలంకరణ చేశారు.

నేడు మున్సిపల్ సమావేశం

నగరి : మున్సిపల్ సాధారణ సమావేశం చైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిలర్లు అందరూ హాజరు కావాలని కోరారు.

కళాకారుల సమస్యలపై చర్చ



కళాకారుల సమస్యలపై చర్చిస్తున్న జానపద వృత్తి కళాకారుల సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: టీటీడీలో కళాప్రదర్శనలతో సనాతన ధర్మప్రచారంలో భాగస్వాములవుతున్న కళాబృందాల సమస్యల పట్ల టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రాజెక్టు అధికారి రాజగోపాల్, ఏఈఓతో జానపద వృత్తి కళాకారుల సంఘం జాతీయ అధ్యక్షుడు పి.యాదగిరి మంగళవారం చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమలలో, ఇతర టీటీడీ ఆలయాల ఉత్సవాలలో కళాప్రదర్శనలు నిర్వహించే కళాబృందాలకు తగిన సదుపాయాలు, అందించాల్సిన సౌకర్యాలను అందించే దిశగా చర్యలు తీసుకోవాలని కళాకారుల సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. అలాగే కొత్త బృందాలను నమోదు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కళా ప్రదర్శన అందించిన కళాకారులకు అందించాల్సిన చార్జీల నగదు చెల్లింపులో అలసత్వంతో కళాకారులు ఇబ్బందులు పడుతున్నారని, వారికి త్వరలో చార్జీల నగదు వారి బ్యాంకు ఖాతాల్లో సత్వరం జమ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కళాబృందాల మార్పులు, చేర్పుల విషయంలో సానుకూలంగా స్పందించి అవకాశం కల్పించాలని తెలిపారు. దీంతో స్పందించిన ప్రాజెక్ట్ అధికారి చార్జీలు ఎవరికైతే తమ బ్యాంకులలో పడలేదో వారు వెంటనే లిస్ట్ ఇస్తే వారికి చార్జీల సొమ్ములు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జానపద వృత్తి కళాకారుల సంఘం నేత కిరణ్ డోలా కృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



పొంగళ్ల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

పాలసముద్రం : మండలంలోని కృష్ణజిమ్మాపురంలో ఉన్న ఎల్లమ్మకు మంగళవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చందనంతో అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ప్రతి ఇంటి నుంచి మహిళలు పొంగళ్ల, పూజసామగ్రిని పంబవాయిద్యాల నడుమ ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణంలో పొంగళ్లు వండి, నైవేద్యం సమర్పించి, ప్రత్యేక దీపారధనలు చేశారు. సాయంత్రం భక్తులు తీసుకొచ్చిన సుగంధభరిత పుష్పాలతో అమ్మవారిని సుందరంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. మొక్కులు ఉన్న భక్తులు పిండి దీపాలు వెలిగించి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మతల్లి

పరవశం.. తలకోన జలపాతం

ఎర్రావారిపాళెం మండలం, తలకోన అడవుల్లో కురిసిన వర్షాలకు స్థానికంగా ఉన్న జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. జాలువారుతున్న జలపాతంలో పర్యాటకులు తడిసి ముద్దవుతున్నారు. తలకోనలోని శిరోద్రోణం, నెలకోన మడుగులో నీటి ప్రవాహం ఆకట్టుకుంటోంది. భక్తులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. – భాకరాపేట





శిరోద్రోణం జలపాతంలో జాలువారుతున్న నీరు (ఇన్‌సెట్) నెలకోన మడుగు వద్ద జలపాతం

బాధ్యతగా పనిచేయాలి



సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పాలసముద్రం : మండలంలోని ఆశా కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ సూచించారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశా కారకర్తలు, ఆరోగ్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. డాక్టర్ మోహన్ కృష్ణ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి, ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. ఆశా కార్యకర్తలు గర్భిణులకు అందుబాటులో ఉంటూ, వారికి సేవలు అందించాలన్నారు. ఏఎన్ఎం, ప్రస్తుతం వాతావరణం మార్పు కారణంగా ప్రబలే వ్యాధులపై అవగాహన కల్పించి, వాటి నివారణకు కృషి చేయాలన్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు దోమలు వృద్ధి చెందకుండా మెలాథిన్ మందు పిచికారీ చేయాలని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు సుశీల, మురళి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



వెదురుకుప్పంలో షణ్ముగరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



ధర్మాచెరువులో పిచ్చయ్యకు నివాళులర్పిస్తూ..

వెదురుకుప్పం: మండల కేంద్రంలో సోమవారం రాత్రి మృతి చెందిన రేషన్ డీలర్ షణ్ముగరెడ్డి కుటుంబాన్ని మాజీ ఉప ముఖ్యమంత్రి కే. నారాయణస్వామి మంగళవారం పరామర్శించారు. సమాచారమందుకున్న మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి ఆ గ్రామానికి చేరుకుని, షణ్ముగరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతికి గల కారణాలు కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ఎవరూ అధైర్యపడకుండా ఉండాలని భరోసాగా ఉంటామని హామీ ఇచ్చారు. అలాగే ధర్మాచెరువు గ్రామంలో జెడ్పీటీసీ సుకుమార్ తండ్రి పిచ్చయ్య మృతి చెందడంతో ఆ గ్రామానికి వెళ్లి పిచ్చయ్య మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సత్యవేడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన రాజేష్‌తో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు షణ్ముగరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ మంత్రి వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేట ధనంజయరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, ఉపాధ్యక్షుడు రామయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ మునికృష్ణారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, మాజీ సర్పంచ్ చిరంజీవిరెడ్డి ఉన్నారు.

ఘనంగా గంగ జాతర



అంబలి, పట్టు వస్త్రాలు ఊరేగింపులో సర్పంచ్ భువనేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బొజ్జారెడ్డి

వెదురుకుప్పం: మండలంలోని పాతగుంటలో మంగళవారం గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కుంకుమ, పసుపు, పాలతో అభిషేకం చేశారు. అమ్మవారిని సర్వాంగ సందరంగా ముస్తాబు చేసి, విశేష పూజలు చేశారు. స్థానిక సర్పంచ్ భువనేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బొజ్జారెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలు, అంబలి సమర్పించారు. సాయంత్రం అమ్మవారి ప్రతిమను పుష్పపల్లకిపై కొలువుదీర్చి, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున మంగళహారతులిచ్చి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బాణసంచా పేలుడుతో గ్రామాలు మారుమోగాయి.

గంగమ్మకు పూజలు

వెదురుకుప్పం మండలంలోని బొమ్మన్‌దొడ్ల గ్రామంలో ఉన్న గంగమ్మ ఆలయంలో మంగళవారం గ్రామస్తులు పూజలు చేశారు. అమ్మవారికి పెద్ద ఎత్తున అంబలి పోసి నైవేద్యం సమర్పించారు. అనంతరం మహిళా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి, పూజలు చేశారు. ఈనెల 18న ఆరిమేని గంగమ్మకు తిరునాళ్లు నిర్వహిస్తున్న నేపథ్యంలో భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

వేడుకగా మాతమ్మ కొలుపు ప్రారంభం





ఆలయంలో భక్తుల సందడి, ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు అరుంధతివాడలో శ్రీ రేణుక మాత పరమేశ్వరిదేవి ఆలయంలో వార్షిక కొలుపు ఉత్సవాలు మంగళవారం సాయంత్రం నుంచి అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు కాపుకట్టు కార్యక్రమంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయ ప్రాంగణంలో పలు దేవతా చిత్రాల విద్యుత్ కటౌట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అమ్మవారికి సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. బుధవారం రాత్రి పుట్ట వద్ద కళాకారులతో రేణుక మాత పరమేశ్వరి కథా ప్రదర్శన ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

నేత్రపర్వం.. గరుడోత్సవం



గరుడినిపై ఊరేగుతున్న స్వామివారు

యాదమరి(పూతలపట్టు): వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఇంద్రపురి వరదరాజులస్వామి గరుడోత్సవం నేత్రానందంగా సాగింది. ఉదయం మూలస్థానంలోని వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదుడికి సుగంధద్రవ్యాలతో అభిషేకం చేశారు. ప్రత్యేకంగా అలకరించి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 9 గంటలకు స్వామివారు గరుడ సేవలో ఊరేగారు. వస్తున్న స్వామివారికి భక్తులు నీరాజనాలు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి కల్పవృక్ష సేవలో స్వామివారు భక్తులు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. బుధవారం ఉదయం హనుమంతవాహనం, రాత్రి గజవాహనం, అలాగే కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు.

ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

